క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డీవోకు వినతి



ఆర్‌డీవో భాస్కరరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: తమ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారుల ఐక్య కార్యాచరణ కమిటీ కోరింది. ఈ మేరకు బుధవారం వారు నిరసన తెలిపారు. తమకు రుణాలు ఇంకా అందలేదని, పీఆర్‌సీ డీఏ బకాయిలు చెల్లించలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. అనంతరం ఆర్‌డీవో భాస్కరరెడ్డికి వినతిపత్రం అందించారు. ముఖ్య సభ్యులు సాయిబాబా, లోవరాజు, ముత్యాలరావు, ఎం.ఆనందరావు, టి.భీమారావు పాల్గొన్నారు.

521 మందికి వైద్య పరీక్షలు



శ్రీనగర్‌లో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బొగ్గు రోడ్డు – 3 సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది 521 మందికి సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నవారిని కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ ఉప్పాడ ఆదిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ సూర్యచంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని రామునాయుడు, పందిరి విజయ్, అక్కరమాని చినబాబు, జీరు వెంకటరెడ్డి, వెంపాడ వెంకటరమణ, కొప్పల కృష్ణ, గిడుతూరి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమి, శివరాత్రి విశిష్టతపై ప్రచారం



చిప్పాడలో ప్రచారం నిర్వహిస్తున్న విజయరాంపురం ప్రతినిధులు

తగరపువలస: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుని శిష్యులు ఆయన రచనల్లోని మాఘపౌర్ణమి, శివరాత్రి విశిష్టతను బుధవారం భీమిలి మండలం పాత మూలకుద్దు, చిప్పాడ పంచాయతీలో ప్రచారం చేశారు. పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా గర్భగుడి లేని ఈశ్వర లింగంగా చూపించేవారని తెలిపారు. మాఘ పౌర్ణమి భగవంతుని జన్మను తెలియజేస్తుందన్నారు. ఈ మాసంలో సుగుణ, నిర్గుణ పూజల విశిష్టతను తెలుసుకోవాలన్నారు. ధర్మాధర్మ విచక్షణ తెలుసుకోవాలన్నారు. ప్రచార కార్యక్రమంలో విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.సురేష్, బి.అంకమ్మ, రాజేశ్వరి, కె.రాజు, వి.భవాని, బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పీఎం పాలెం: భవనం మీద నుంచి పడిన వ్యక్తి తీవ్రంగా గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ముగడ నరసింగరావు (40) పెద రుషికొండలో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఓ ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్‌గా పని చేస్తుండగా అతని భార్య పాప పాల వ్యాపారం చేస్తోంది. మంగళవారం సాయంత్రం 7 : 30 గంటల సమయంలో నిర్మాణంలో ఉన్న భవనంపైకి వాటర్ పైపు కోసం ఎక్కాడు. ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడగా వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. భార్య పాప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: భీమిలి పరిధిలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. రూ.1.27 కోట్లతో జీవీఎంసీ 4వ వార్డు పరిధి కొత్తూరులో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, కె.నగరపాలెం వద్ద సీసీ రోడ్లు, నర్సింహనగర్‌లో సామాజిక భవనం నిర్మాణాలకు బుధవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఈ ప్రాంతంలో ఇంతలా అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎక్కడ అవసరమున్నా వెంటనే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో ప్రజలకు అవసరమైన అన్ని పనులు జాప్యం లేకుండా జరుగుతున్నాయన్నారు. అలాగే ప్రతీ పని ఎంతో నాణ్యతతో, సకాలంలో పూర్తి చేస్తుండడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఈ ప్రాంతంలోని మత్స్యకారులను గత ప్రభుత్వంలో కేవలం ఓటు బ్యాంకుగా చూశారు తప్ప... వారి సమస్యలు, అవసరాలు పట్టించుకోలేదని ఆరోపించారు. జగనన్న ప్రభుత్వంలో మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఓటు వేయడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలుపల్లి కొండబాబు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

తాటిచెట్లపాలెం: రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే, ప్రజలందరూ సంక్షేమ ఫలాలు పొంది సుఖసంతోషాలతో జీవించాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఏర్పాటు కావాలని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 45వ వార్డు భీమిలి పరిధిలోని సింగాలమ్మపురంలో కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన శిలాఫలక ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ పరిపాలిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో భీమిలి పెద్దదని, సుమారు 126 సచివాలయాలు తన పరిధిలో ఉన్నాయని తెలిపారు. ప్రతీ సచివాలయం పరిధిలో పర్యటించి, సమస్యలు గుర్తించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. కొన్ని దశాబ్దాలుగా పరిష్కారం కాని సింహాచలం దేవస్థానం సమస్య సీఎం చొరవతో ముందుకు వెళ్తుందని, ఇన్నేళ్లుగా ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల మరమ్మతులకు అనుమతులు ఇప్పించారని తెలిపారు. త్వరలోనే కోర్టులో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేలా ముఖ్యమంత్రి జగన్ తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరై, పూర్తయిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని కార్పొరేటర్ హనోకుతో కలిసి ముత్తంశెట్టి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఈఈ మత్సరాజు, ఏఈ ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు రాజు యాదవ్, బాబూరావు, సురేష్, కనకరాజు, ఎల్లాజీ, రవిశంకర్, నాయుడు, శ్యామ్, శ్రీహరి, సచివాలయ సిబ్బంది, సీవోలు, ఆర్పీలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లిప్ అమలుతీరు పరిశీలన

పద్మనాభం: మండలంలోని మూడు పాఠశాలల్లో అభ్యసనాభివృద్ధి (లిప్) కార్యక్రమం ఏ మేరకు అమలు జరుగుతుందోనని ఎంఈవో పి.రమణతో కూడిన ఐదుగురు సభ్యుల బృందం బుధవారం పరిశీలించింది. అనంతవరం, గంధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొత్త కొవ్వాడ ప్రాథమిక పాఠశాలను ఈ బృందం సందర్శించి ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు అభ్యసనాభివృద్ధి అమలు తీరును పరిశీలించారు. బేస్ లైన్‌కు సంబంధించి రికార్డులు పరిశీలించారు.

క్రైస్తవుల ఉపవాస దీక్షలు ప్రారంభం

తగరపువలస : క్రైస్తవ విశ్వాసుల 40 రోజుల ఉపవాస దీక్షలను బుధవారం భీమిలి రోడ్డులోని ఎల్ఎం చర్చిలో బిషప్ మోహన్‌కుమార్ కాటన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 40 రోజుల శ్రమదినాల్లో పాటించాల్సిన నిబంధనలు వివరించారు. ఈ కాలంలో ప్రత్యేక ప్రార్థనలతోపాటు దానం చేయాలని సూచించారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని తెలిపారు.

లీగల్ స్టేటస్‌పై అవగాహన

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో లీగల్ స్టేటస్‌పై మెడికల్ ఫ్యాకల్టీకి బుధవారం అవగాహన కల్పించారు. డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సెల్ కమిషన్ – 1 ఎం.ఎస్.రహిమున్నీషా బేగం లీగల్ స్టేటస్, మెడికల్ నెగ్లిజెన్స్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి పూజలు

- పాఠశాలల్లో విద్యార్థులకు అక్షరాభ్యాసాలు



చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



గుడిలోవ శ్రీ సరస్వతి విద్యా విహార్‌లో సామూహిక అక్షరాభ్యాసాలు



విద్యార్థులతో పూజలు చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ

తగరపువలస : వసంత పంచమి సందర్భంగా భీమిలి అర్బన్, రూరల్ పరిధిలోని పలు విద్యా సంస్థల్లో సరస్వతీ దేవి పూజతోపాటు సామూహిక అక్షరాభ్యాసాలు బుధవారం నిర్వహించారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.సత్యనారాయణ విద్యార్థులతో పూజ చేయించారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో వసంత పంచమి వేడుకల్లో భాగంగా ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక తదితరులు పాల్గొన్నారు. రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో వసంత పంచమి వేడుకలు నిర్వహించి విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు. తగరపువలస శ్రీబాసర లీడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చైర్మన్ పూడి రమేష్, అర్చకుడు ఏడిద కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో సరస్వతీదేవికి పూజలు చేశారు. గుడిలోవ శ్రీ సరస్వతి విజ్ఞాన్ విహార్‌లో వసంత పంచమి సందర్భంగా 54 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసాలు చేయించారు. విజ్ఞాన్ విహార్‌లో కూడా వేడుకలు నిర్వహించారు.

మధురవాడ: వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం మధురవాడలోని వివిధ పాఠశాలల్లో అక్షరాభ్యాసాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు సరస్వతీ దేవి గుడిలో పూజలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మీనా, కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అర్చకులు పట్నాల సుబ్బారావు శర్మ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. అనంతరం అమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సూరిబాబు, నాగోతి తాతారావు, పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, గూడేల రాజు పాల్గొన్నారు.

కొమ్మాది: స్థానిక అష్టలక్ష్మి ఆలయంలో శ్రీపంచమి సందర్భంగా బుధవారం వంద మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు జరిపించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం సరస్వతీ దేవి పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.



రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో పూజలు



బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస వేడుకలు



అష్టలక్ష్మి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరుపుతున్న అర్చకులు

భక్తి, జ్ఞాన మార్గాల ద్వారానే భగవదనుగ్రహం

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ



హనుమద్వైభవాన్ని వివరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీకాలనీ: భక్తి, జ్ఞాన మార్గాల ద్వారా మాత్రమే భగవదనుగ్రహాన్ని పొందగలమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో నిర్వహిస్తున్న హనుమద్వైభవ ప్రవచనాల్లో భాగంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆంజనేయుడిని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించినట్లే అన్నారు. మార్గశిర మాసంలో హనుమారాధన శుభప్రదమన్నారు. పలు అధ్యాత్మిక అంశాలపై భక్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య బ్రదర్స్ భక్తి సంగీత విభావరి అలరించింది. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రవచనాలు బుధవారంతో ముగిశాయి.

దేశ వ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



ఆటో స్టాండ్ వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మధురవాడ : అఖిల పక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆటో రిక్షా, ఇతర ప్రైవేటు యాజమాన్యాలు, డ్రైవర్లు చేపట్టనున్న సమ్మె జయప్రదం కోరుతూ బుధవారం వుడా కాలనీ మొగధారమ్మ ఆటో స్టాండ్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మోపుతున్న భారాలు, చట్టాల మార్పు కోసం ఈ నెల 16న చేపడుతున్న దేశ వ్యాప్త గ్రామీణ, పారిశ్రామిక బంద్‌లో అంతా భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే ప్రమాదకరమైన చట్టాలు చేసి, ఆటో, ఇతర వాహన కార్మికులను వారి వృత్తులకు దూరం చేస్తోందన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, తదితర డిమాండ్స్ కోసం చేస్తున్న సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రయ్య, పి.రాము, దుర్గారావు, పైడిరాజు పాల్గొన్నారు.

పద్మనాభస్వామి క్షేత్రం అభివృద్ధికి కృషి



పద్మనాభ యుద్ధ స్థలాన్ని పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

పద్మనాభం : పద్మనాభంలోని గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. గిరిపై ఉన్న అనంత పద్మనాభుని ఆలయాన్ని బుధవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం పద్మనాభం యుద్ధ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు నిలయమైన అనంత పద్మనాభుని క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతుని ఆలయ అభివృద్ధికి ప్రసాదం పథకం కింద నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో 13 శిబిరాలు నిర్వహించి ఎంపిక చేసిన మూడు వేల మంది దివ్యాంగులకు రూ.2.50 కోట్ల విలువైన ఉప కరణాలు ఈ నెల 15న పోర్టు స్టేడియంలో కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం గోపాల్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామన్నారు. అనంతరం పద్మనాభం యుద్ధంలో అసువులు బాసిన రెండో చిన విజయ రామరాజు సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, బీజేవైఎం భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బి.రవికుమార్, పద్మనాభం మండల అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



బాధితుడు లక్ష్మణ్‌కు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం: మండలంలోని చందక గ్రామానికి చెందిన గుండె సంబంధిత రోగి దొంతల లక్ష్మణకు మంజూరైన రూ.2 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం అందించారు. పేద కుటుంబానికి చెందిన లక్ష్మణ్ ఇటీవల ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు మంజూరైన చెక్కును నగరంలోని క్యాంప్ కార్యాలయంలో బాధితునికి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బంక శ్రీను, మాజీ సర్పంచ్ గుసిడి వెంకటరమణ, పీఏసీఎస్ డైరెక్టర్ లొలుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న వెంకట రామారావు

పద్మనాభం: తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు కోరారు. ఈ డిమాండ్‌తో ఇచ్ఛాపురంలో ప్రారంభించిన పాదయాత్ర 18వ రోజైన బుధవారం పద్మనాభం చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బంగ్లా ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని తెలగ కులస్తులు పేదరికంలో ఉన్నారని తెలిపారు. ఈ నెల 25న బోగాపురంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కులస్తులంతా వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, శేరికండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, పిల్లి మురళి, వాడపల్లి సీతారాం, పుప్పాల అప్పలరాజు పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లు కార్మికుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరుతూ ఐక్య కార్మిక సంఘాల నాయకులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు క్యాంప్ కార్యాలయంలో బుధవారం కలిసి వినతపత్రం అందించారు. రెండేళ్లుగా మిల్లు యజమాని తప్పించుకుని తిరుగుతూ బకాయిలు చెల్లించడం లేదన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు భీమిలిలో కార్మిక సంఘాల నాయకులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు, జాయింట్ లేబర్ కమిషనర్‌తో చర్చలు జరిపించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును దల్లి అప్పలరెడ్డి, అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు తదితరులు కలిశారు.

గెడ్డ రక్షణకు చర్యలు చేపట్టాలి



పోర్టు కాలనీలో గెడ్డ స్థలం ఆక్రమించి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం పోర్టు కాలనీలో రూ. 20 లక్షలు విలువ చేసే గెడ్డ వాగు స్థలం 150 గజాలు కొందరు వ్యక్తులు ఆక్రమించి ఇష్టానుసారంగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. బొట్టవానిపాలెం చెరువు, నగరంపాలెం చెరువు పరిసర ప్రాంతాల నుంచి మిగులు నీరు, వర్షం నీరు హైవే దాటి భగవాన్‌దాస్ కాలనీ, సాయిరాం కాలనీ, మారికవలస, పరదేశిపాలెం మీదుగా భీమిలి బీచ్ వరకు ప్రవహించే అత్యంత ముఖ్యమైన గెడ్డ ఇది. ఇప్పటికే గత పాలకుల పుణ్యమా అని చాలా వరకు ఆక్రమణకు గురైపోయింది. ఇప్పుడు తాజాగా కొందరు వ్యక్తులు గెడ్డను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి గెడ్డ రక్షణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పుల్వామా దాడిలో అమరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సంతపేట గ్రామస్తులు

తగరపువలస : ఐదేళ్ల క్రితం పుల్వామా జిల్లాలో భారతీయ సైనికులను తరలిస్తున్న వాహనాల కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి జరిగిన సంఘటనలో అమరులైన వారికి బుధవారం సంతపేట వాసులు నివాళులర్పించారు. అంబేద్కర్ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఐనాడ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆనాటి దుర్ఘటనలో 40 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సైనికులు అమరులయ్యారన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జాతీయ జెండాలు ప్రదర్శించారు. స్థానిక యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.